**7 జూన్ 2026 – క్రీస్తు పవిత్ర శరీర రక్తముల మహోత్సవం**

**– సంవత్సరం A:** ద్వితీ 8,2-3.14-16; 1 కొరి 10,16-17; యోహా 6,51-58

## పరిచయం:

ఒక చిన్న బాలుడు తన తల్లిదండ్రులతో కలిసి ఒక పెద్ద షాపింగ్ సెంటర్‌కు వెళ్లాడు. అతడు ఎక్కడ చూసినా ప్రకాశవంతమైన లైట్లు, రంగురంగుల ప్రదర్శనలు, మరియు తిండి పదార్థాలతో నిండిన అల్మారాలు కనిపించాయి. అతడు మిఠాయిలు, బొమ్మలు, పానీయాలు అడిగాడు, తల్లిదండ్రులు కొన్నింటిని ఇచ్చారు. కానీ కొంతసేపటికి అతడు అసహనంగా, చిరాకు గలవాడిగా మారిపోయాడు. చివరికి అతని తల్లి అతడిని కూర్చోబెట్టి, ఒక సాండ్విచ్ ఇచ్చి, "నిజంగా నీకు అవసరమైనది ఇదే" అని చెప్పింది. అప్పుడు మాత్రమే అతడు ప్రశాంతంగా మారి తృప్తి పొందాడు.

అదే విధంగా, మనం కూడా మన జీవితాలను అనేక విషయాలతో నింపుకుంటాం—పని, విజయం, వినోదం, సంపదలు. అయినప్పటికీ, మనలో లోతుగా ఒక కొరత మిగిలిపోతుంది; వీటిలో ఏదీ **కూడా** మన **ఆశలను** 9పూర్తిగా తీర్చలేవు. మనకు చాలా ఉన్నప్పటికీ, ఇంకా ఏదో లోపమైందనే భావన కలుగుతుంది.

ఈరోజు, క్రీస్తు పవిత్ర శరీరం మరియు రక్త మహోత్సవం సందర్భంగా, ఆ లోతైన ఆకలి నిజమని సంఘం మనకు గుర్తుచేస్తోంది—మరియు దానిని తీర్చడానికి దేవుడే మనవద్దకు వస్తున్నాడు. పరిశుద్ధ బలిలో, యేసు మనకు ఏదో ఒకటి మాత్రమే ఇవ్వడం కాదు; తననే మనకు ఇస్తున్నాడు. ఆయన మనకు నిజమైన ఆహారమై, మన హృదయాల తపనను తీర్చగల జీవ

ఆహారమవుతున్నాడు.

మనము ఈ బలి పీఠం చుట్టూ కూడినప్పుడు, మనము నిండుగా ఉన్నందుకు రాలేదు; మనము ఆకలితో ఉన్నందుకు వచ్చాము—మనము అర్హులమై ఉన్నందుకు కాదు; మనము అవసరమై ఉన్నందుకు వచ్చాము. కాబట్టి ఇప్పుడు కొద్దిసేపు మౌనంగా ఉండి, మన పాపాలను మరియు మనలోని శూన్యతను అంగీకరించి, మనలను నిజంగా నింపగల ఒకే ఒకరిని స్వీకరించడానికి మన హృదయాలను సిద్ధం చేసుకుందాం.

## బోధనాంశం: జీవ ఆహారమైన క్రీస్తు – మన లోతైన ఆకలిని తీర్చుతూ, మనలను ప్రేమలో ఐక్య పరుస్తాడు

ఒక యువకుడు ఎన్నో సంవత్సరాలు విజయాన్ని వెంబడిస్తూ గడిపాడు. అతడు కష్టపడి చదివాడు, మంచి ఉద్యోగం సంపాదించాడు, మంచి డబ్బు సంపాదించాడు, ప్రపంచం చుట్టూ తిరిగాడు, తన జీవితాన్ని అనుభవాలతో నింపుకున్నాడు. ఒక సాయంత్రం, నగరాన్ని వీక్షించే తన అందమైన అపార్ట్‌మెంట్‌లో ఒంటరిగా కూర్చున్నప్పుడు, అతడికి ఒక విచిత్రమైన శూన్యత అనిపించింది. అన్నీ ఉన్నట్టే ఉన్నాయి—కానీ ఏదో లోపమైందనిపించింది. “ఇదే అంతా?” అని అతడు తనను తాను అడిగాడు. “నా లోపల ఇంకా ఎందుకు ఆకలి ఉంది?”

ఆ ప్రశ్న అతనిదే కాదు. అది ప్రతి మనిషి హృదయంలో మౌనంగా వినిపించే ప్రశ్న. ప్రియ సోదర సోదరీమణులారా, ఈరోజు క్రీస్తు శరీర రక్త మహోత్సవం మనలోని ఆ దాగి ఉన్న ఆకలితో నేరుగా మాట్లాడుతోంది. ఇది మనకు చెబుతోంది: ఆహారపు ఆకలికంటే లోతైన ఆకలి ఉంది—అర్థం కోసం, ప్రేమ కోసం, దేవుని కోసం ఉన్న ఆకలి. ఆ ఆకలికి సమాధానం యేసు స్వయంగా.

“బాబెట్ పండుగ” అనే చిత్రంలో చెప్పబడే ఒక అందమైన కథ ఉంది. బాబెట్ అనే ఒక గొప్ప వంటకారిణి, ఒక చిన్న సాధారణ సమాజం కోసం ఒక అద్భుతమైన విందు సిద్ధం చేయడానికి తన దగ్గర ఉన్నదంతా ఖర్చు చేస్తుంది. వారు భోజనానికి కూర్చున్నప్పుడు, ఒక అసాధారణమైన మార్పు జరుగుతుంది. పాత గాయాలు మానిపోతాయి, హృదయాలు తెరుచుకుంటాయి, ఆనందం తిరిగి వస్తుంది. వారిని మార్చింది కేవలం ఆహారం కాదు—ఆ విందులో పోయిన ప్రేమ.

పరిశుద్ధ బలిలో మనం ఇదే జరుపుకుంటున్నాం. ఇది కేవలం రొట్టె మరియు ద్రాక్షారసం కాదు—ఇది ఇవ్వబడిన ప్రేమ, పంచుకున్న జీవితం, మనకు సమర్పించబడిన క్రీస్తు స్వయంగా.

అప్పట్లో ఐదు రొట్టెలను రెండు **చేపలను ఐదు వేల మందికి పంచిన** తర్వాత

ప్రజలు యేసును రాజుగా చేయాలనుకున్నారు. వారి ఆకలి సమస్యను పరిష్కరించగలవాడిగా ఆయనను చూశారు. కానీ యేసు దూరమయ్యాడు. ఆయన “రొట్టెల రాజు”గా ఉండడానికి రాలేదు—కేవలం కడుపులను నింపడానికి కాదు. ఆయన మానవ ఆత్మ యొక్క లోతైన ఆకలిని తీర్చడానికి వచ్చాడు.

ఆ ఆకలిని మనకు బాగా తెలుసు. మనుషులు విజయం, గౌరవం, ఆనందం, అనుభవాల కోసం ప్రయత్నిస్తారు—అయినా ఏదో అసంపూర్ణంగా మిగిలిపోతుంది. ఎప్పుడూ తృప్తి పొందని మిఠాయిల కోసం అడిగే చిన్నపిల్లలా, మనం కూడా మన జీవితాలను నిజంగా పోషించలేని వాటితో నింపుకుంటాం.

ఇది ఒక చిన్న కథ ద్వారా స్పష్టమవుతుంది. ఒక పిల్లవాడు తన తల్లిని

మిఠాయిల కోసం అడుగుతూనే ఉండేవాడు. తల్లి అతనికి చాలా ఇచ్చింది, చివరకు అతడు అనారోగ్యానికి గురయ్యాడు. అప్పుడు ఆమె అతని ముందు ఒక సరళమైన, పోషకమైన భోజనం పెట్టి, "నిజంగా నీకు అవసరమైనది ఇదే" అని చెప్పింది. అదే విధంగా, మన హృదయాలు తాత్కాలిక ఆనందాల కోసం కాదు, లోతైన మరియు శాశ్వతమైన దాని కోసం తపిస్తాయి.

"నేనే జీవ ఆహారం" అని యేసు చెప్పినప్పుడు, ఆయన ఆ తపనకు సమాధానం ఇస్తున్నాడు. ఆయన "నేను మీకు ఆహారం ఇస్తాను" అని కాదు; "నేనే ఆహారం" అని చెబుతున్నాడు. మనం వెతుకుతున్న పోషణ, అర్థం, జీవితం, ప్రేమ—**అన్నీ** ఆయనలోనే ఉన్నాయి.

పరిశుద్ధ బలిలో ఇది నిజమవుతుంది. కడరా భోజన సమయంలో యేసు రొట్టెను తీసుకొని, "ఇది నా శరీరం" అని అన్నాడు. పానపాత్రను తీసుకొని, "ఇది నా రక్తం" అని అన్నాడు. ఆ మాటలలో ఆయన ఏదో ఒకటి కాదు, తన సమస్తాన్ని ఇచ్చాడు. ఆ భోజనంలో ప్రారంభించినదాన్ని ఆయన సిలువపై పూర్తి చేశాడు. పరిశుద్ధ బలి ఆ స్వయంసమర్పణ ప్రేమ యొక్క సజీవ సాన్నిధ్యం.

ఈ రోజుల్లో కూడా మనం ఈ లోతైన ఆకలిని మరిచిపోవడం ఎంత సులభమో చూస్తున్నాం. మనం సమృద్ధి గల ప్రపంచంలో జీవిస్తున్నాం, అక్కడ ప్రజలు ఆకలి లేకపోయినా తింటారు. అయినప్పటికీ, శరీరం నిండినా, ఆత్మ ఖాళీగా ఉండవచ్చు.

ఒక యాజకుడు కొంతమంది యువకులను అడిగాడు: "మీకు నిజంగా ఏ ఆకలి ఉంది?" కొంత మౌనం తర్వాత వారు ఇలా చెప్పారు: "మమ్మల్ని అంగీకరించాలి… జీవితానికి అర్థం ఉండాలి… ప్రేమించబడాలి."

ఇవి హృదయపు నిజమైన ఆకలి. వాటిని తీర్చడానికి యేసు వస్తున్నాడు.

ఒక చిన్న పిల్లవాడు తన మొదటి దివ్య సత్ప్రసాదాన్ని స్వీకరించాడు. తరువాత అతడిని ఎందుకు అంత సంతోషంగా ఉన్నావని అడిగారు. అతడు సాదాసీదాగా ఇలా చెప్పాడు: "యేసు నాకొచ్చాడు కాబట్టి." ఇదే పరిశుద్ధ బలి యొక్క హృదయం—మనం బలికి వస్తున్నామనే విషయం మాత్రమే కాదు; క్రీస్తు మనవద్దకు వస్తున్నాడు.

మనం ఆయనను స్వీకరించినప్పుడు, ఏదో ఒకటి జరుగుతుంది. మనం మొదట ఆయనతో, తరువాత ఒకరితో ఒకరు **విలీనమై** ప్రవేశిస్తాము. పవిత్ర

లు మనకు గుర్తు చేస్తున్నట్లుగా, "మనము అనేకులమైనప్పటికీ, ఒకే రొట్టెను పంచుకునే కారణంగా ఒక శరీరముగా ఉన్నాము."
ఒక కుటుంబ భోజనాన్ని ఆలోచించండి. వారు పరిపూర్ణులైనందుకు కాదు, వారు ఒకరికొకరు చెందినవారైనందుకు కలిసి కూర్చుంటారు. అదే విధంగా, బలి పీఠం ప్రభువు యొక్క భోజనపట్టిక. మన పక్కన ఎవరు నిలుస్తారో మనం ఎన్నుకోము, అయినప్పటికీ మనం క్రీస్తులో సోదర సోదరీమణులముగా ఏకమవుతాము.

అందుకే పరిశుద్ధ బలి మనలను మార్పుకు పిలుస్తుంది. పవిత్ర ఆగస్టిన్ ఇలా అన్నాడు: "మీరు స్వీకరించేది మీరు అవ్వండి; మీరు అవుతున్నదాన్ని స్వీకరించండి." మనం కేవలం పోషించబడటం మాత్రమే కాదు—మనం మార్పు చెందుతాము. మనం క్రీస్తువలె మారడానికి, ఇతరులకు "ఆహారం" కావడానికి—జీవితం ఇచ్చేవారిగా, క్షమించేవారిగా, ప్రేమించేవారిగా మారడానికి పిలువబడ్డాము.

ఇక్కడ ఒక జ్ఞాపకం కూడా ఉంది. సౌఖ్య సమయాల్లో మనం దేవునిని

సులభంగా మరిచిపోతాము. అందుకే యేసు “ఇది నా జ్ఞాపకార్థం చేయండి” అని అన్నాడు. కానీ ఈ జ్ఞాపకం గతాన్ని గుర్తుచేసుకోవడం మాత్రమే కాదు—ఇది ఆయన ప్రేమను ఇక్కడ, ఇప్పుడు సజీవంగా చేస్తుంది. ప్రతి బలి క్రీస్తుతో ఒక సజీవ సన్నిధి.

అనేక ప్రాంతాల్లో ఈ మహోత్సవాన్ని ఊరేగింపుతో జరుపుకుంటారు. పరిశుద్ధ బలి వీధుల గుండా తీసుకువెళ్తారు, ప్రజలు అనుసరిస్తారు. ఇది ఒక శక్తివంతమైన గుర్తు—మన రోజువారీ జీవితాలలో క్రీస్తు మనతో నడుస్తున్నాడనే సూచన.

చివరిగా ఒక కథ. ఒక వృద్ధుడు ఎప్పుడూ ఈ ఊరేగింపును మిస్ కాలేదు. ఒకసారి ఎవరో అతడిని ఎందుకు అని అడిగారు. అతడు నవ్వుతూ ఇలా అన్నాడు: “మొత్తం వారమంతా నేను ఆయనను అనుసరించడానికి ప్రయత్నిస్తాను. ఈరోజు మాత్రం ఆయన నన్ను నడిపిస్తాడు.”

మనము చేయవలసినది ఇదే.

మన ఆకలితో—మన ప్రశ్నలతో, మన శూన్యతతో, మన తపనతో—ఈ బలి పీఠానికి వస్తున్నాము. ఇక్కడ యేసు తనను సంపూర్ణంగా మనకు ఇస్తున్నాడు. తరువాత ఆయన మనలను పంపిస్తున్నాడు—ఏకంగా జీవించడానికి, మనకు చూపిన ప్రేమలాగే ప్రేమించడానికి, మరియు ఆకలితో ఉన్న ప్రపంచానికి ఆయన జీవాన్ని తీసుకువెళ్లడానికి.

మనము తెరిచిన హృదయాలతో గాక  మరియు ఈ భోజనపట్టిక నుండి మార్పు చెందిన వారిగా వెళ్లుదాం. ఆమేన్.

**Translated by: Rev. Fr. Francis Theetla, Parish Priest of Paidikaluva, Cuddapah.**